సర్కారు వైద్యం.. పేదలకు దూరం

- జగన్ ప్రభుత్వంలో ఇంటి ముంగిటకే వైద్యం
- నేడు కనుమరుగైన ఆ పథకాలు
- వైద్యులను నియమించని కూటమి సర్కార్
- కొత్తపేట సీహెచ్‌సీలో 11 మంది వైద్యులకు నలుగురే దిక్కు


కొత్తపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్

కొత్తపేట: ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సర్కార్ వైద్యం అందని ద్రాక్షగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటి ముంగిటకే వైద్య సేవలు రాగా.. నేడు ఆ సేవలు నిలిచి పోయి వైద్యం దూరాభారమైంది. ఎన్నో వ్యయ ప్రయాసలు కోర్చి పెద్దాస్పత్రులని వెళ్తే అక్కడ అవసరమైన వైద్యులు లేక అరకొర వైద్య సేవలు మాత్రమే అందుతున్నాయని, గత్యంతరం లేక ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి, జేబులు గుల్ల చేసుకోవలసి వస్తుందని వాపోతున్నారు.

పేరుకే పెద్దాసుపత్రి.. సేవల్లో చిన్నాసుపత్రే..

వైద్య విధాన పరిషత్ కొత్తపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పేరుకే పెద్దాసుపత్రి.. వైద్యుల సంఖ్యలో, సేవల్లో చిన్నాసుపత్రే.. అని ప్రజలు వాపోతున్నారు. ఇది ప్రసూతి విభాగం 20 బెడ్స్‌తో కలిపి 70 పడకల ఆస్పత్రి. నియోజకవర్గంలో పెద్దాస్పత్రిగా పిలవబడే ఈ ఆస్పత్రిలో 11 మంది వైద్యులకు ప్రస్తుతం నలుగురే ఉన్నారు. వారిలో ఒకరు నైట్ డ్యూటీ చేస్తుంటే డే డ్యూటీ చేసేది ఇక ముగ్గురే. వారే వైద్యో నారాయణ అంటూ సేవలందిస్తున్నారు. ఇదీ ఈ ఆస్పత్రి పరిస్థితి. ప్రస్తుతం వాతావరణ మార్పులు, గ్రామాల్లో జలుబు, దగ్గు, వైరల్ ఫీవర్స్ వంటి వ్యాధుల వ్యాప్తితో అనారోగ్య పీడితుల సంఖ్య పెరుగుతుంది. ప్రభుత్వ ఆస్పత్రులను ప్రజలు ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రుల్లో వైద్యుల సేవలు, ఇతర సౌకర్యాలు తదితర అంశాలు పరిశీలనకు 'సాక్షి' విజిట్ సందర్భంగా గుర్తించిన అంశాలు ఇలా ఉన్నాయి. ఈ ఆస్పత్రిలో జనరల్ ఓపీ సుమారు 300–350 వరకూ ఉంటుంది. గర్భిణుల ఓపీ సుమారు 20–50 వరకూ ఉంటుంది. ఇక్కడ దాదాపు అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తున్నారు. ఆస్పత్రికి మొత్తం డాక్టర్ పోస్టులు 11. అయితే 4 డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముగ్గురు వైద్యులు వివిధ కారణాలు, వ్యక్తిగత సమస్యల వలన సెలవులో ఉంటున్నారు. ఇక డ్యూటీలో దాదాపుగా ఎప్పుడూ నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఒకరు నైట్ డ్యూటీ చేస్తే డే డ్యూటీకి రారు. దాంతో ముగ్గురే సేవలందిస్తున్నారు. వారిలో ఒకరు (ఆర్థోపెడిక్) సదరం క్యాంపులు నిమిత్తం వారానికి మూడు రోజులు స్థానికేతర ఆస్పత్రులకు వెళుతున్నారు. ఆ మూడు రోజులు ఇక ఇద్దరే గతి. వారే వైద్య సేవలందిస్తున్నారు. ఇక్కడ జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, చిన్న పిల్లల వైద్యులు లేకపోవడం ప్రధానమైన లోటుగా ఉంది. ముఖ్యంగా గైనిక్ ఆపరేషన్లు తప్ప ఇతర శస్త్ర చికిత్సలు చేసేందుకు జనరల్ సర్జన్ లేక ఆయా రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించవలసి వస్తుందని పలువురు వాపోయారు. అలాగే ఎక్స్‌రే సిబ్బంది ఒకరే ఉండటం వలన రాత్రి, సెలవు రోజుల్లో బయట తీయించాల్సి వస్తుంది.

వైద్యులను నియమించాలి



ఈ ఆస్పత్రి స్థాయికి, వివిధ వ్యాధులకు సంబంధించిన రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులను నియమించాలి. వైద్యులు లేకపోవడం వలన ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లవలసి వస్తుంది. పేదలు ఎన్నో వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు తీసుకోవాలి.

– ముళ్ల జనార్దనరావు, ఎంపీటీసీ సభ్యుడు, గంటి

ఉన్న వైద్యులతోనే సేవలు



ఈ ఆస్పత్రిలో ప్రధానంగా డీసీఎస్ పోస్టుల కొరత ఉంది. ఈ విషయమై తరచూ పై అధికారులకు లెటర్లు పెడుతున్నాం. ముఖ్యంగా చిన్న పిల్లల వైద్య సేవలకు సంబంధించి కాంట్రాక్ట్ వైద్యుల కోసం ప్రయత్నించినా ఎవరూ జాయినవడం లేదు. సాధ్యమైనంత వరకూ ఎవరికీ వైద్య సేవలు అందలేదనే మాట రాకుండా ఉన్న వైద్యులతో వైద్య సేవలు అందిస్తున్నాం. విద్యుత్ అంతరాయం లేకుండా ఇటీవల చిన్న జనరేటర్‌ను రిపేర్ చేయించాము.

– జి.దుర్గాప్రసాద్, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, కొత్తపేట

క్లుప్తంగా

దోహాలో వైఎస్సార్ జయంతి


దోహాలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎన్నారైలు

సఖినేటిపల్లి: ఖతార్ దేశ రాజధాని దోహాలో మంగళవారం రాత్రి వైఎస్సార్ జయంతి స్థానిక ఎన్నారైలు ఘనంగా నిర్వహించారు. వివరాలు ఖతార్ వైఎస్సార్ సీపీ కన్వీనర్, రామేశ్వరానికి చెందిన దొండపాటి శశికిరణ్ ఈ–మెయిల్ ద్వారా బుధవారం మీడియాకు తెలిపారు. దోహాలోని తాజ్ మహారాజా హోటల్‌లో ఈ వేడుకలు చేశారు. కన్వీనర్ శశికిరణ్ ఆధ్వర్యాన వైఎస్సార్ చిత్రపటం వద్ద అభిమానులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన పుట్టినరోజు కేక్‌ను శశికిరణ్ కట్ చేశారు. గల్ఫ్ ప్రతినిధి మండ వర్జిల్‌బాబు, కో కన్వీనర్లు జాఫర్ హుస్సేన్, ఆరోన్ మనీష్ తదితరులు పాల్గొన్నారు.

ఓ మంచి వ్యక్తిని కోల్పోయాం


శ్రీనివాసు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న జగ్గిరెడ్డి

ఆలమూరు: పినపళ్ల గ్రామీణ పశు వైద్యాధికారి ఈదల శ్రీనివాసు మృతితో ఒక మంచి వ్యక్తిని కోల్పోయినట్లయిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. పశు వైద్యాధికారి శ్రీనివాసు మరణవార్తను తెలుసుకున్న జగ్గిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆలమూరులోని మృతుడు శ్రీనివాసు నివాసానికి హుటాహుటిన చేరుకుని మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాసు భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే కుటుంబసభ్యులకు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. సర్పంచ్ నేలపూడి లావణ్య, నామాల శ్రీనివాసు, రావాడ సత్తిబాబు, నాంద్ర నాగమోహన్‌రెడ్డి, నాయుడు ప్రసాద్, కప్పల శ్రీధర్, యం.వెంకన్న పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పరామర్శ

కడియం: మండలంలోని దుళ్ల గ్రామానికి చెందిన యన్నమని శ్రీరామ్ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆయన కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. తొలుత శ్రీరామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. శ్రీరామ్ బావ, అంకంపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గంగారామ్ చౌదరితో పాటు, తండ్రి యన్నమని లక్ష్మణరావు తదితరులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పలువురికి 'గన్నవరపు' పరామర్శ


వై.కొత్తపల్లిలో శ్రీనును పరామర్శిస్తున్న కోఆర్డినేటర్ గన్నవరపు

పి.గన్నవరం: మండలంలో అనారోగ్యానికి గురై కోలుకుంటున్న పలువురిని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు బుధవారం పరామర్శించారు. వై.కొత్తపల్లి గ్రామంలో ఇటీవల ప్రమాదానికి గురై కోలుకుంటున్న రామేశ్వరపు శ్రీనివాసరావును, ఇటీవల ఆపరేషన్ చేయించుకుని కోలుకుంటున్న పార్టీ కార్యకర్త బళ్ల కృష్ణమూర్తిని, కె.ఏనుగుపల్లిలో అనారోగ్యానికి గురై కోలుకుంటున్న పార్టీ కార్యకర్త కొల్లే శ్యామ్ సుందరరావును గన్నవరపు పరామర్శించారు. కార్యక్రమాల్లో మండల శాఖ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్, దొమ్మేటి దుర్గారావు, కొల్లే సూర్యనారాయణ, కత్తుల పెద్దిరాజు, మట్టపర్తి పండు, గుర్రం వీరాస్వామి, యల్లమెల్లి సత్యనారాయణ, దేవరపల్లి గౌతమ్ పాల్గొన్నారు.

52 మందికి ఉచిత కంటి పరీక్షలు

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో నిర్వహించిన శిబిరంలో 52 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 14 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసేందుకు నిర్ధారించినట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు.

ఫసల్‌బీమాను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.ధర్మప్రసాద్ అన్నారు. వాకలగరువు, తొండవరం గ్రామాల్లో సర్పంచ్‌లు పేరాబత్తుల రామలింగరాజు, మద్దింశెట్టి సుబ్బారావుల అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ పంట నష్టాల వలన కలిగే ఆర్థిక ఇబ్బందుల నుంచి రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన అమలు చేస్తుందని, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ జి.శివమోహన్, పి.జాబేజ్‌శాస్త్రి, హెచ్‌ఈఓ సతీష్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం


రామేశ్వరంలో బాత్రూమ్ గోడ కూలిన ఘటనలో గాయపడిన బాలుడు

సఖినేటిపల్లి: మండలంలోని రామేశ్వరంలో ఇటీవల పంచాయతీ వద్ద ఎలిమెంటరీ ప్రాథమిక పాఠశాల వద్ద పాత బాత్రూమ్ గోడ కూలిన ఘటనలో గాయపడి, చికిత్స పొందున్న విద్యార్థి అడబాల జస్వంత్‌కు బుధవారం గ్రామస్తులు ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ సరెళ్ల విజయ్‌ప్రసాద్, విలేజ్ వెల్ఫేర్ ట్రస్టు మెంబర్ అల్లూరి మధురాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు సమకూర్చిన రూ.25 వేల నగదు పోస్టాఫీస్‌లో జమ చేసి, పోస్టల్ పుస్తకాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. స్థానికులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థిక సాయం

మలికిపురం: మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు సమకూర్చిన ఆర్థిక సాయాన్ని బుధవారం అందించారు. మలికిపురంలో వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు చేతుల మీదుగా చెక్‌ల రూపేణా బాధితులకు అందించారు. అత్తిలి గాయత్రి (సఖినేటిపల్లి)కి రూ.50 వేలు, రావి వెంకటేశ్వరరావు (పడమటిపాలెం)కు రూ.10 వేలు, వారణాసి దేవదాసు(లక్కవరం)కు రూ.10 వేలు, పి.వరలక్ష్మి రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బైపాస్ సర్జరీ రోగికి...

సఖినేటిపల్లి: మండలంలోని మోరిపోడులో బుధవారం గుండె బైపాస్ సర్జరీ రోగి కోరుకొండ ఫిలిప్ మణికుమార్‌కు, ఇజ్రాయెల్‌లోని స్థానిక ఎన్నారై బుంగ రాజేష్ రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు వైద్య ఖర్చులు నిమిత్తం పై సాయాన్ని ప్రముఖుడు గుర్రం జేసురత్నం చేతుల మీదుగా రోగికి అందజేశారు.

నాణ్యతా ప్రమాణాలతో భవనాన్ని నిర్మించాలి


మెట్లకాలనీలో భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యత ప్రమాణాలతో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరం మెట్లకాలనీలో జరుగుతున్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను బుధవారం ఎంపీపీ పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ రూ.18 లక్షలతో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఈ పనులకు సంబంధించి అసిస్టెంట్ ఇంజినీర్ వి.నాగేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ వెంట నాగవరపు నాగరాజు, పల్లి రమేష్, పల్ల శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్త గంటా దుర్గాదేవి పాల్గొన్నారు.

ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త సేకరించండి


ఆదుర్రులో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీఎల్పీఓ బొజ్జిరాజు

మామిడికుదురు: ప్రతి ఇంటి నుంచి రోజూ తడి, పొడి చెత్తను సేకరించాలని అమలాపురం డీఎల్పీఓ బొజ్జిరాజు సూచించారు. ఆయన బుధవారం లూటుకుర్రు, ఆదుర్రు గ్రామాల్లో పర్యటించారు. ప్రజల నుంచి చెత్త సేకరణను పరిశీలించారు. చెత్త సేకరణపై పలు సూచనలు చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా తడి, పొడి చెత్తను వేరు వేరుగా వేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులకు ప్రజలు సహకరించాలని బొజ్జిరాజు కోరారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రాజు ఉన్నారు.

దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు కృషి

ఆలమూరు: దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని పారా స్వచ్ఛంద సంస్థ ల్యాంప్ అడ్వకసీ కో ఆర్డినేటర్ మారే సుబ్బాయమ్మ, సీబీఆర్ కోఆర్డినేటర్ బడుగు మహిమారావు అన్నారు. మండలంలోని సంధిపూడి పంచాయతీ వద్ద సర్పంచ్ తోట భవాని అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో పారా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొని దివ్యాంగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన సదస్సు నిర్వహించి భారీ ర్యాలీ నిర్వహించారు. బాలికల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. దివ్యాంగుల్లో ఉన్న అంగవైకల్యాన్ని 21 రకాలుగా గుర్తించి ఆమేరకు ప్రభుత్వం సదరం ధ్రువ పత్రాలను జారీ చేస్తుందన్నారు. ఆర్టీసీ సమకూర్చిన బస్ పాస్‌లను రాయితీపై 20 మంది దివ్యాంగులకు సర్పంచ్ భవాని పంపిణీ చేశారు. ఎంపీటీసీ తోలేటి సంతోషి, గ్రామ పెద్దలు దొడ్డ సుబ్బారావు, నల్లా వెంకటేశ్వరరావు, తోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాలకు రేపు నీటి సరఫరా బంద్

పి.గన్నవరం: ముంగండ మంచినీటి ప్రాజెక్టు చెరువులో సహజ సిద్ధంగా పెరిగిన చేపల కోసం ఇటీవల జిల్లా పరిషత్ వేలం నిర్వహించిన నేపథ్యంలో పాటదారులు చేపలు పడుతున్న కారణంగా శుక్రవారం పలు గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జె.కళ్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ కారణంగా ప్రాజెక్టు పరిధిలోని పి.గన్నవరం, ఎల్.గన్నవరం, పోతవరం, ముంగండ, ముంగండపాలెం, కె.ముంజవరం, వై.కొత్తపల్లి, ఆర్.ఏనుగుపల్లి గ్రామాలకు తాగునీటి సరఫరా ఉండదన్నారు. శనివారం నుంచి యథావిధిగా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.

ఉప్పునీరు పోటెత్తకుండా గట్టు పటిష్టత పనులు

సఖినేటిపల్లి: అంతర్వేదికర గ్రామంలో సముద్ర తీరంలో గతంలో ఉన్న రక్షణ గట్టును మరింత పటిష్టం చేసేందుకు స్థానికులు తవ్వకం పనులు చేపట్టినట్టు తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం అంతర్వేదికర గ్రామంలో సముద్ర తీరానికి చేరి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై వివరణ కోరిన సందర్భంలో తహసీల్దార్ పై విధంగా తెలిపారు. ఈ మేరకు సదరు ఏరియాను ఇప్పటికే పరిశీలించినట్టు చెప్పారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర గతంలో ఉప్పునీరు గ్రామంలోకి పోటెత్తకుండా రక్షణగా గట్టు ఉందని, ఈ గట్టును బలపరస్తూ మరింత రక్షణ చేకూర్చే విధంగా తవ్వకాలు చేస్తున్నారన్నారు. పనులు రాత్రి వేళల్లో కాకుండా పగలు సమయాల్లో మాత్రమే నిర్వహించేటట్టు ఆదేశాలు జారీ చేశామన్నారు.

పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ

మామిడికుదురు: పంచాయితీ పురోగతి సూచికపై సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించే దిశగా ఉద్యోగుల్లో నైపుణ్యం పెంచే లక్ష్యంతో ఈ శిక్షణ ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీఓ జి.భవాని తెలిపారు. ఉద్యోగుల సామర్థ్యాలను సంపూర్తిగా వినియోగించుకునే దిశగా ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ కృషి చేస్తుందన్నారు. ఈ శిక్షణను ఉద్యోగులు సద్వినియోగం చేసుకుని సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. రిసోర్స్ పర్సన్లు డి.కృష్ణాజీ, వి.వెంకన్న, ఎస్.నాగమణి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి


అంబాజీపేటలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు


మామిడికుదురులో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న కార్మికులు

అంబాజీపేట/మామిడికుదురు/సఖినేటిపల్లి/మలికిపురం/రాజోలు/అయినవిల్లి/ పి.గన్నవరం/రావులపాలెం: కార్మికుల హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని కార్మిక సంఘ నాయకులు, మహిళలు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా, మిడ్డేమీల్స్, శానిటేషన్, వీఓఏలు, ఇతర కార్మికులు బుధవారం ఆయా తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేసి ర్యాలీ నిర్వహించారు. కార్మికులు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లు అమలయితే కార్మికులు జీవించే హక్కును కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్లకు అందజేశారు. కార్యక్రమాల్లో సీఐటీయూ నాయకులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, తదితర రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


సఖినేటిపల్లిలో నిరసన ప్రదర్శన చేస్తున్న అంగన్‌వాడీ, ఆశ, మిడ్డే మీల్స్ కార్యకర్తలు


రాజోలులో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రాజోలు: విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన విద్యుత్ లైన్ల మరమ్మతులు నిర్వహించేందుకు ఈ నెల 11న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పొన్నమండ, చింతలపల్లి, కాట్రేనిపాడు, మెరకపాలెం, కూనవరం, ములికిపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సిరిపల్లి, మాగం, కె.జగన్నాథపురం, విలస, రావిగుంటచెరువు తదితర గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ అమలాపురం ఈఈ కె.రాంబాబు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ 11 కేవీ కె.జగన్నాథపురం ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు వంటి పనులు నిర్వహించనున్నట్లు కె.రాంబాబు తెలిపారు. విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని ఆయన కోరారు.

పురుగుమందు తాగబోయిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

రావులపాలెం: ఇంటిలో కోపగించి ఆత్మహత్య చేసుకోవాలని పురుగుల మందు డబ్బాను తీసుకుని వెళుతున్న వ్యక్తిని రావులపాలెం పోలీసులు కాపాడారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని గోపాలపురానికి చెందిన లలితసాయి రమేష్ బుధవారం ఇంటిలో కోపగించి బయటకు వెళ్లిపోయాడు. ఇంటిలో ఉన్న పురుగుమందు డబ్బాను తీసుకుని చనిపోతానని వెళ్లడంతో తండ్రి నాగేశ్వరరావు రావులపాలెం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విషయం తెలిపాడు. దీంతో లొకేషన్ ఆధారంగా రమేష్ గంటి రహదారిలో ఉన్నట్టు గుర్తించి ఏఎస్సై చిన్నారావు, క్రైం కానిస్టేబుల్ త్రిమూర్తులు వెంటనే ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఈ సమయంలో రహదారి చెంతన ఉన్న పొలంలో పురుగుమందు డబ్బాతో ఉన్న రమేష్‌ను పట్టుకుని స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి తండ్రికి అప్పగించారు.

తాత్కాలిక రహదారి రక్షణకు చర్యలు

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం–కోటిపల్లిరేవులో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారి వరదనీటితో కోతకు గురవుతుంది. దీంతో రేవు నిర్వాహకులు రహదారి కొట్టుకు పోకుండా ఇసుక బస్తాలతో రక్షణ ఏర్పాట్లు చేశారు. రెండు రోజులుగా వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో తాత్కాలిక రహదారిని వరద నీరు చుట్టుముట్టింది. దీంతో సగం రహదారి కోతకు గురైంది. దీంతో ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని ఈ రక్షణ చర్యలు చేపట్టినట్లు రేవు నిర్వాహకులు తెలిపారు.

పావంచాలకు శంకుస్థాపన

మామిడికుదురు: లూటుకుర్రులో పంచాయతీ నిధులు రూ.3 లక్షలతో నిర్మించనున్న పావంచాల నిర్మాణానికి సర్పంచ్ అడబాల తాతకాపు బుధవారం శంకుస్థాపన చేశారు. ప్రజల కోరిక మేరకు గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు. పంచాయతీ నిధులతో రోడ్ల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో స్థానికులు విళ్ల సుబ్బారావు, గోకవరపు నాగేశ్వరరావు, పెద్దింటి సత్యశింగరాచార్యులు, గోకవరపు రాజా, కూటమి నేతలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల జనరల్ సెక్రటరీగా వంశీ



సఖినేటిపల్లి: మండల వైఎస్సార్ సీపీ కమిటీలో మోరి గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాసరావు(వంశీ)కు పదవి దక్కింది. పార్టీ కేంద్ర కార్యాలయం ఇటీవల విడుదల చేసిన ప్రకటనలో జనరల్ సెక్రటరీగా ఆయనను నియమించారు. ఇందుకు సహకరించిన రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావుకు ఆయన బుధవారం కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతి సాగుతో మానవాళికి ఎంతో మేలు


తాటిపాక పీహెచ్‌సీలో విక్రయిస్తున్న ఆకుకూరలు

రాజోలు: ప్రకృతి వ్యవసాయ సాగుతో ఎంతో మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ తాటిపాక ఇన్‌చార్జి పోతురాజు ప్రసన్న కుమార్ అన్నారు. బుధవారం చెన్నడం గ్రామంలో సర్పంచ్ బడుగు శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన ఆకుకూరలు, కూరగాయలను తాటిపాక పీహెచ్‌సీ వద్ద స్టాల్ ఏర్పాటు చేసి ఆరోగ్య సిబ్బందికి విక్రయించారు. వీఏఏ బాలాజీ, ఐసీఆర్‌పీ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పర్యటనపై ఆంక్షలు దారుణం

మలికిపురం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా పర్యటనలో ప్రభుత్వం ఆంక్షలు విధించడం దారుణమని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. బుధవారం ఆయన మలికిపురంలో మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు దారుణంగా నష్టపోతే రైతులను పరామర్శించడం కూడా నేరమేనా అని సూర్యారావు ప్రశ్నించారు. జగన్ పర్యటనలో జన స్పందన చూస్తుంటే అక్కడి రైతులలో ఉన్న బాధ, వేదన అర్థం అవుతుందన్నారు. ప్రజా వ్యతిరేకత చూసి దానిని అణచివేయాలని ప్రభుత్వం కుట్రలు పన్నుతుందన్నారు. ప్రభుత్వ కుట్రను తిప్పి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నరాజా, నాయకులు కేఎస్ఎన్ రాజు, పాటి శికుకుమార్, తాడి సహదేవ్, గుర్రం జాషువా, జిల్లెళ్ల ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

మెగా ఎంపీటీఎంకు వినూత్న స్వాగతం


మెగా పేరెంట్స్ మీట్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

మామిడికుదురు: మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్(ఎంపీటీఎం)కు ఈదరాడ జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు బుధవారం వినూత్నంగా స్వాగతం పలికారు. 'ఎంపీటీఎం' ఇంగ్లిష్ అక్షరాలుగా ఒదిగిపోయి గ్రాండ్ వెల్కం చెప్పారు. హెచ్ఎం జి.సాయిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గురువారం జరిగే పేరెంట్స్ మీట్‌లో పేరెంట్స్‌కు మొక్కలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పర్యావరణ పరిరక్షణలో పేరెంట్స్‌ను భాగస్వాములను చేసేందుకు మొక్కల పంపిణీ నిర్వహిస్తున్నామన్నారు.

రావులపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా కుమార్

రావులపాలెం: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్‌గా వైవీవీఎస్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కొవ్వూరు డిపో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై రావులపాలెం వచ్చారు. ఇక్కడ మేనేజర్‌గా ఉన్న జీజీవీ రమణ బదిలీపై తుని డిపోకు వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కుమార్‌కు డిపో ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.